శ్రమజీవికి ఆసరా ఈ-శ్రమ్

- అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- ఆర్థిక, సామాజిక భద్రతకు దోహదం
- సచివాలయాల్లో నమోదు ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో ప్రచారం

కపిలేశ్వరపురం: శ్రమ జీవికి ఆసరాగా ఈ-శ్రమ్ పథకం. ఎలాంటి చిరునామా లేకుండా వ్యాపార కార్యకలాపాలు చేసే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకాన్ని రూపొందించింది. క్షేత్ర స్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక శాఖ విశేష కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలులో ఉన్న గ్రామ సచివాలయాలు నమోదు ప్రక్రియకు ఎంతగానో దోహదం చేస్తున్నాయి.

రెండు నియోజకవర్గాల్లో శ్రామిక శక్తి ఇలా...

మండపేట నియోజకవర్గంలో 43, రామచంద్రపురం నియోజకవర్గంలో 77 మొత్తం 120 గ్రామాల్లో పంచాయతీ కార్మికులు రోజువారీ శ్రమ చేస్తున్నారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని లంక గ్రామాల్లో కొబ్బరి ఒలుపు కార్మికులున్నారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వందలాది మంది అంగన్‌వాడీ, ఆయాలున్నారు. కపిలేశ్వరపురం, మండపేట పట్టణం, కె.గంగవరం మండలాల్లో విస్తారంగా మత్స్యకార్మికులు ఉన్నారు. మండపేట పరిసర గ్రామాల్లో 120 పైగా రైస్‌మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వందలాది మంది కార్మికులు ఉత్పత్తిలో శ్రమిస్తున్నారు. బలమైన కోళ్ల పరిశ్రమ ద్వారా ఇతర ప్రాంతాలకు గుడ్లు ఎగుమతి సాగుతోంది. మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో మూడు వేల మంది వలస కార్మికులు ఉన్నారు. రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాల్లో విస్తారంగా భవన నిర్మాణ కార్మికులున్నారు.



కేదారిలంకలో ఆవ కాలుస్తున్న ఇటుక బట్టీ వలస కార్మికులు (ఫైల్)

పథకం లక్ష్యం ఇదీ..

పెద్ద వ్యాపారులు వ్యాపార సంస్థను ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. వాటికి గుర్తింపు, రుణ సాయం తదితర సదుపాయాలంటూ ఉంటాయి. వలస, అసంఘటిత, రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు అటువంటివి దక్కవు.వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఆయా విభాగాల్లోని శ్రామికులు ఈ- శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ పథకంలో నమోదుకు అర్హులు వీరే...

16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన నిర్మాణ, వలస కార్మికులు, ఇంటి పనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్స్, షాపులలో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు

ప్రయోజనాలిలా...

విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునే దిశగా ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో ఒక్కసారి నమోదైతే సరిపోతుంది. రెన్యువల్ చేయించనవసరం లేకుండా జీవితాంతం వివరాలు వెబ్ సైట్లో ఉంటాయి. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ నమోదు అవసరం, ఆర్థికసాయం నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమ చేసే విలు కలుగుతుంది.

ఈ-శ్రమ్ ప్రయోజనాలివీ...

సంస్థల్లో పనిచేసేవారికి సంస్థ ద్వారా గుర్తింపుతో పాటు పీఎఫ్ ఈఎస్ఐ వంటి సదుపాయాలు లభిస్తాయి. కానీ అసంఘటితంగా ఉన్న కార్మికులకు ఎలాంటి గుర్తింపు, సదుపాయాలు లేవు. ఈ విషయమై ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలనిచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు రాష్ట్రల్లో అసంఘటితంగా ఉన్న కార్మికులందరినీ గుర్తించి, గుర్తింపు కార్డును జారీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షలు ప్రమాద భీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష ఆర్థిక సాయమందిస్తారు.

ఇలా నమోదు చేసుకోవాలి

కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఉచితంగా వివరాలను నమోదు చేసి యూనివర్శల్ అకౌంట్ నంబర్ (యూఎన్ఏ) గుర్తింపు కార్డును సైతం జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్‌లలో నమోదు చేసుకోవచ్చు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి దగ్గర పనిచేస్తున్నాడో వెల్లడి చేయాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నాడో చెబితే సరిపోతుంది.

ఈ-శ్రమ్ నమోదు ఇలా...

గ్రామ, వార్డు వలంటీర్, సచివాలయం, మండపేటలోని లేబర్ ఆఫీసర్ కార్యాలయంలలో ఈ శ్రమ్‌లో వివరాలను నమోదు చేస్తారు. కార్మికుడు తన ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటోను తీసుకెళ్ళాలి. నామినీ ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలను కూడా ఇవ్వాలి.

క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



ఈ శ్రమ్ నమోదు క్షేత్ర స్థాయిలో అవగాహన కలిస్తున్నాం. మండపేట, అంగర తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహించాం. రెండు నియోజకవర్గాల పరిధిలో మండపేట, రాయవరం, రామచంద్రపురంలలో సహాయ కార్మికాధికారి కార్యాలయాలున్నాయి. వాటితో పాటు సచివాలయాల్లో కూడా వివరాలను నమోదు చేసుకోవచ్చు.

– వి.పద్మావతి, సహాయ కార్మికాధికారి, మండపేట

క్లుప్తంగా

నేడు మండపేటలో వ్యాసరచన పోటీలు

మండపేట: హిరోషిమా నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు పలు విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు హెచ్ఎం శోభావళి తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అణ్వాయుధాలతో నేటి ప్రపంచం అనే అంశంపై వక్తృత్వ, అణ్వాయుధాల దాడులు-పర్యవసనాలు అనే అంశంపై వ్యాసరచన, హిరోషిమా నాగసాకి దినోత్సవంపై క్విజ్, అణ్వాయుధాల నివారణ- పర్యావరణ సమతుల్యతపై డ్రాయింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి జూనియర్స్ విభాగం (6, 7, 8 తరగతులు) నుంచి ఇద్దరు, సీనియర్స్ విభాగం (9, 10 తరగతులు) నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్విజ్ పోటీకి స్కూల్‌కు ఒక టీమ్ (ఇద్దరు) మాత్రమే అనుమతిస్తామని హెచ్ఎం శోభావళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ ప్రారంభమయ్యే అర గంట ముందు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పీఠంలో లలితానంద భారతీ స్వామి పూజలు



పీఠంలో పూజలు చేస్తున్న లలితానంద భారతీ స్వామి

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన లలితానంద భారతీస్వామి సందర్శించారు. ప్రస్తుతం లలితానంద భారతీ స్వామి విశాఖపట్నంలో లలితా ఆశ్రమంలో చాతుర్మాస దీక్షలో ఉన్న లలితానందభారతీస్వామి పీఠంలో పూజాదికాలు నిర్వహించారు. పీఠంలో ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన విజయదుర్గ పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్)ను కలుసుకున్నారు. గాడ్‌తో ఏకాంతంగా కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా లలితానందభారతీ స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతోనే పీఠానికి వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం చాతుర్మాస దీక్షలో ఉన్న తాను అమ్మవారి దర్శనానికి వచ్చానన్నారు. అంతకుముందు లలితానందభారతీ స్వామిని పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) పీఠానికి సాదరంగా ఆహ్వానించారు.

గంగాధర్‌కు బీసీ సంఘ నేతల అభినందనలు



గంగాధర్‌ను సత్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మండపేట: మండపేట సొసైటీ చైర్మన్‌గా నియమితులైన పట్టణ శెట్టిబలిజ సంఘం మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్‌కు బీసీ సంఘం జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకుడు కోన సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ తదితరులు గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. గంగాధర్ హయాంలో మండపేట సొసైటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సంఘ నాయకులు చుక్కల అప్పారావు, కింతాడ హేమశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల సంతాపం

మండపేట: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం నాలుగు దశాబ్దాల పాటు గద్దర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తన గళంతో కోట్లాది మంది ప్రజలను ఉత్తేజపరిచారని ఎమ్మెల్యే వేగుళ్ల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ప్రజా గాయకుడు గద్దర్ పాడిన పాటలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. ఆయన మృతితో గొప్ప మానవతావాదిని కోల్పోయినట్టయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. గద్దర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం ఒక ప్రకటనలో కామన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

పెత్తందారీ వ్యవస్థపై అవిశ్రాంత పోరాటం

పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సమాజంలో మార్పు కోసం తన ఆట పాటతో ప్రజా గాయకుడు గద్దర్ అలుపెరుగని పోరాటం చేశారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ ఎస్టీ సర్పంచుల సమాఖ్య కో -కన్వీనర్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. గద్దర్ మృతి చాలా బాధాకరమని, గొప్ప ప్రజాకవిని కోల్పోయామని ఆశీర్వాదం ఆవేదన వ్యక్తం చేశారు.

చిరస్మరణీయుడు జక్కంపూడి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జయంతి

మండపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమించిన మాజీ మంత్రి, జక్కంపూడి రామ్మోహనరావు చిరస్మరణీయుడని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కామత్ ఆర్కేడ్‌లో జక్కంపూడి జయంతిని ఘనంగా జరిగింది, ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జక్కంపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతం లక్ష్యంగా జక్కంపూడి పనిచేసేవారన్నారు. ఆయనతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాపారాయుడు, రాజుబాబు మాట్లాడుతూ జక్కంపూడి సేవలను కొనియాడారు. అనంతరం వంద మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, విప్ పోతంశెట్టి ప్రసాద్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, జిన్నూరి సాయిబాబా, పలివెల సుధాకర్, కొప్పిరెడ్డి ప్రసాద్, వల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో జక్కంపూడికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

కేశవరంలో..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో కేశవరంలో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతి నిర్వహించారు. గ్రామంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జక్కంపూడి చిత్ర పటానికి వెంకన్నబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.



రామచంద్రపురం జక్కంపూడి జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు

అనంతరం కేక్ కట్‌చేసి అందరికి స్వీట్లు పంచారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నాయకులు అల్లంపల్లి కిషోర్, తుపాకుల ప్రసన్నకుమార్, పెదపాటి శివయ్య, మన్నే భూషణం, సలాది శివ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: జనహృదయ నేత, దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మంత్రి వేణు క్యాంపు కార్యాలయం వద్ద జక్కంపూడి జయంతిని ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి మంత్రి వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వేణు మాట్లాడుతూ జక్కంపూడి రాజకీయ గురువు అని ఆయన పోరాట పటిమ స్ఫూర్తి దాయకమన్నారు. ఉమ్మడి ఏపీలో అతి పెద్ద జిల్లా అయిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి జెడ్పీ చైర్మన్‌గా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికవడానికి జక్కంపూడి తనపై చూపిన ప్రేమను మరువలేదని గుర్తుకు చేశారు. తన నమ్మిన వారి కోసం ప్రజల అవసరాల కోసం 24 గంటలు కృషి చేసిన గొప్ప నాయకుడు జక్కంపూడి ఆదర్శనీయులు అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నేత, జక్కంపూడి యువసేన అధ్యక్షుడు తొగరు మూర్తి మాట్లాడుతూ విధేయతకు విశ్వసనీయతకు జక్కంపూడి నిలువెత్తు నిదర్శనమన్నారు. పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిండి సురేష్, పార్టీ నేతలు పెంటపాటి శ్రీను, యాళ్ల సత్తిబాబు, మధు, పేపకాయల జానకీరామయ్య, కొప్పిశెట్టి శ్రీనివాస్, సంగిశెట్టి మణికంఠ, ఉప్పు శ్రీణు, తోట శ్రీను, దొమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై శాంతి ర్యాలీ



ఏడిదలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మండపేట: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ మండలంలోని ఏడిదలో ఆదివారం రాత్రి క్రైస్తవులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్పైకస్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వీఎస్ దివాకర్ దేవ సహాయం మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దాడులతో అమాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రైస్తవులపై దాడులు అరికట్టి శాంతి స్థాపనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ కార్యదర్శి డాక్టర్ పీటీ జేమ్స్‌పాల్, కోశాధికారి కె జాన్‌పాల్, సంఘ నాయకులు చిక్కాల రాంబాబు పాల్గొన్నారు.

బీమాతో సంఘ సభ్యులకు ధీమా

రామచంద్రపురం రూరల్: జీవిత బీమాతో సంఘాలలో ఉంటున్న సభ్యులకు ధీమా ఏర్పడుతుందని వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాష్ (బాబి) అన్నారు. ద్రాక్షారామ లక్ష్మీదుర్గా కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి లైటింగ్, డెకరేషన్, టెంట్‌హౌస్, సౌండ్‌సిస్టం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘ గౌరవాధ్యక్షుడి హోదాలో బాబి హాజరయ్యారు. 2020లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న సభ్యులందరికీ యూనియన్ తరపున ఖర్చులు భరించి రూ.10 లక్షలు విలువైన పోస్టల్ ఇన్సూరెన్స్‌ను అందజేశారు. పలువురు సీనియర్ సభ్యులకు భీమేశ్వరస్వామి చిత్రపటాలతో సత్కరించారు. కార్యక్రమంలో రావులపాలెం, ఆలమూరు, మండపేట, మండపేట రూరల్, కపిలేశ్వరం, రాయవరం, కాజులూరు, ఐ.పోలవరం తాళ్లరేవు, కరప మండలాల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం



ఆర్యావటంలో గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకట సుబ్బారావు



వెదురుపాకలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ పెద్దబ్బాయ్

కాజులూరు: పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమౌతుందని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. ఆదివారం ఆర్యావటం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణలో జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు పాల్గొని పలువురు లబ్ధిదారులకు సమతుల ఆహారం కిట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా బిడ్డకు పోషకాహారం అంది భావితరం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పరిగణనలో తీసుకునే సీఎం జగనన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా గర్భిణులకు సమతుల ఆహారం కిట్లను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది బి.వీరలక్ష్మి, దుర్గాభవాని పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని వెదురుపాకలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి (పెద్దబ్బాయ్) చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు టీహెచ్ఆర్‌లో భాగంగా ఈ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ మండల నూతన కమిటీ ఎన్నిక

కపిలేశ్వరపురం: కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అంగరలోనా శ్రావణి ప్రాథమిక వైద్యాలయం ఆవరణలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు సమక్షంలో కమిటీ ఏర్పాటైంది. నూతన కమిటీ అధ్యక్షుడిగా గంగుమళ్ళ రాంబాబు, కార్యదర్శిగా సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారిగా రుద్ర లక్ష్మీ నారాయణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ సామాజిక బాధ్యతలో నిలవాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడు గంగుమళ్ళ రాంబాబు మాట్లాడుతూ వైద్యులంతా నిరంతరం శ్రమిస్తూ నూతన వైద్య విధానాలపై అవగాహన పెంచుకునేందుకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు బళ్ళా శ్రీనివాసరావు, కేఎస్ ప్రసాద్, కపిలేశ్వరపురం మండల గౌరవ అధ్యక్షుడు సూరంపూడి సత్యనారాయణ, నాయకులు కోన సత్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, మేడిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



నూతన కమిటీ నాయకులు రాంబాబు తదితరులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

రామచంద్రపురం రూరల్: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా లభిస్తుందని రామచంద్రపురం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ శివన్నారాయణ అన్నారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని పైడా వారి సత్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముందుగా సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీకి ఊరట లభించటంపై కాంగ్రెస్ నాయకులు కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు, ఆర్‌డీ ఖాన్, త్రిమూర్తులు, దంగేటి నాగేశ్వరరావు, ఖండవల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ ఆవిష్కరణలు యువతకు మార్గదర్శకం

రామచంద్రపురం: గణిత శాస్త్రంలో రామానుజన్ ఆవిష్కరణలు విద్యార్థులకు మార్గదర్శకమని గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక గణిత అకాడమీలో ఆదివారం ఏపీ గణితశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదో తరగతి నూతన గణిత శాస్త్ర టెక్స్ట్ బుక్ బోధనపై ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్‌షాపును కేవీవీ ప్రారంభించారు. రామానుజన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణితం అంటే రామానుజన్ మాత్రమే కాదని, మనల్ని మనం ఒక్కసారి గణిత మేధావుల్ని గుర్తుకు చేసుకోవాలంటే ఎంత మంది గుర్తుకు వస్తారో ప్రతి టీచర్ వారికి వారు ప్రశ్నించుకోవాలని సూచించారు. పాఠం చెప్పేముందు ఉపాధ్యాయుడు అంశంపై పూర్తి నైపుణ్యం సాధించాలన్నారు. అంతేకాకుండా ప్రతి టీచర్‌కు సొంత లైబ్రరీ ఉండాలన్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న 34వ రామానుజన్ జాతీయ స్థాయి గణిత పోటీలకు ఈనెల 31లోగా ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకోవాలని అకాడమీ ఎగ్జామ్స్ సెల్ నిర్వాహకుడు కె.శ్రీకృష్ణసాయి తెలిపారు. ఈ సదస్సుకు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామానుజన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేవీవీ, గణిత ఉపాధ్యాయులు

అ'పూర్వ' కలయిక



వేడుకకు హాజరైన పూర్వ విద్యార్థులు

మండపేట: మూడు దశాబ్దాల క్రితం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్న 1993–1995 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో సందడి చేశారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు వేడుకకు హాజరై చిన్ననాటి మధుర జ్ఞాపకాలు, నిక్‌నేమ్‌లను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ, నిక్‌నేమ్‌లతో ఆట పట్టించుకున్నారు. ఆరు నెలల క్రితం పూర్వ విద్యార్థులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, జాయన సాయి, దొడ్డిపట్ల ప్రకాష్, కోటిపల్లి కృష్ణ, ఆరేటి నాని, కంది అప్పారావు, కాయల రమేష్, నగేష్ తదితరులతో కలసి ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ పూర్వ విద్యార్థులంతా మరలా కలుసుకునేందుకు మార్గం సుగమం చేసింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు విజయ సారథి, నాగయ్య, వీరన్న, రాజేంద్రప్రసాద్, శ్యామకుమారి, మంగాదేవి, నాగరవిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పెమ్మాడ శ్రీనివాస్, శేఖర్, హుస్సేన్, స్వామి, రామతులసి, పీఆర్ఎల్ స్వామి, రామలక్ష్మి, సువర్ణరాణి, రాధ, విజ్జి, ప్రసన్న, రాజీ, రాజ్యలక్ష్మి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఘనంగా స్నేహితుల దినోత్సవం

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని యువత ఘనంగా జరుపుకొన్నారు. మిత్రులు ఒకరికొకరు చేతికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి స్వీట్లు పంచుకున్నారు. సోషల్‌మీడియాలో గ్రీటింగ్స్ తెలుపుకొన్నారు. ముఖ్యంగా ఆదివారం రాత్రి గ్రామాల్లో పలుచోట్ల యువకులు స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని విందు, వినోదాలను నిర్వహించుకుని పండగలా సందడి చేశారు.

రూ.4.02 కోట్లతో గ్రామాభివృద్ధి

కొత్తపేట: ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవిడి గ్రామం గణనీయమైన అభివృద్ధి సాధించినట్టు సర్పంచ్ రెడ్డి చంటి తెలిపారు. తన హయాంలో సుమారు రూ.4.02 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలు, స్కూలు భవనాలు తధితర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్టు తెలిపారు. జరుగుతున్న పలు రోడ్ల పనులను సర్పంచ్ చంటి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పుల్లెలవారిపేట, శ్మశానం రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి, సహకారంతో ప్రధానమైన మార్కెట్-కట్వాలాంబిక అమ్మవారి ఆలయం వరకూ రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, రూ.12 లక్షలతో రక్షిత మంచినీటి పథకం, రూ.1.32 కోట్లతో రెండు సచివాలయాలు, రెండు ఆర్‌బీకేల భవనాలు, ఒక వెల్‌నెస్ సెంటర్ భవనం, నాడు-నేడు కింద రూ.1.43 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అదనపు భవనాలు, తరగతి గదుల నిర్మాణం పూర్తిచేసినట్టు తెలిపారు.

కల్వర్టుకు రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



మొగలిపాలెంలో శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న కల్వర్టు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెంలో పంటకాలువపై ఉన్న కల్వర్టు ప్రమాదభరితంగా మారింది. గత 15 సంవత్సరాల క్రితం పంచాయతీ నిధులతో అధికారులు ఈ కల్వర్టును నిర్మించారు. క్రమేపీ కల్వర్టు కింది భాగంలో మట్టి కరిగిపోయి కాలువలోకి కలసిపోవటంతో రహదారి కింది భాగం గుల్లగా మారింది. దీంతో ట్రాక్టర్, లారీ వంటి భారీ వాహనాలు ప్రయాణిస్తే కల్వర్టు విరిగిపోయి కూలిపోతుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు నల్లమిల్లి ఆదిరెడ్డి, ద్వారంపూడి శేషారెడ్డి, మల్లిడి సూర్యనారాయణరెడ్డి తదితర్లు కోరుతున్నారు.